వర్ష సూచనలతో రైతన్న ఆందోళన

సాగులో ఉన్న వరి పంట



కోతలకు వెళ్తున్న యంత్రం



- సర్వేపల్లి నియోజకవర్గంలో 85 వేల ఎకరాల్లో సాగు
- మరో వారంలో కోతలు
- పంట నేలపాలవుతుందని ఆందోళన
- ఇప్పటికి 50 శాతమే పూర్తి
- ధాన్యం తడిస్తే దిగజారనున్న ధరలు
- చినుకు రాలితే వరికోత యంత్రాలకు డిమాండ్

పొదలకూరు: వర్ష సూచనతో రైతులు వణికిపోతున్నారు. కోతలు ప్రారంభమై ధాన్యాన్ని విక్రయించుకుంటున్న సమయంలో అకాల వర్షమొస్తే తీవ్రంగా నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ, రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా తదితర ప్రాంతాల్లో వర్షాలు స్వల్పంగా కురుస్తున్నాయి. మరోవైపు అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ హెచ్చరికలతో కోత పనులకు ఉపక్రమిస్తున్నారు.


వారం తర్వాత నూర్పిడి

ఆకాశం మేఘావృతం కావడంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. మరో వారం రోజులగితే నూర్పిడి పనులు పూర్తి చేసుకుని ధాన్యాన్ని ఇంటికి చేర్చుకోవడం లేదా కల్లాల్లోనే విక్రయించనున్నారు. వర్షం కురిస్తే వరి కంకులు బరువుకు వాలిపోయి ధాన్యం నేలరాలుతుందని బెంబేలెత్తుతున్నారు. ముందుగా వరిసాగు చేసిన రైతులు నూర్పిడి పనులు చేపడుతుండగా, ఆలస్యంగా నాట్లేసిన వారు ఏప్రిల్ రెండో వారం వరకు ఆగి కోతల పనులు చేపట్టాల్సి ఉంటుంది. సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో సుమారు 85 వేల ఎకరాల్లో వరిని సాగు చేస్తున్నారు. ధాన్యం ధరలు గిట్టుబాటు కాక నష్టాలను చవిచూడాల్సి వస్తున్న పరిస్థితుల్లో అకాల వర్షం కురిస్తే అప్పులపాలు కావడం తథ్యమని పేర్కొంటున్నారు.

యంత్రాలకు డిమాండ్

వర్ష సూచనలతో వరికోత యంత్రాలకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం గంటకు రూ.2200 నుంచి రూ.2400 వరకు వసూలు చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి రూ.మూడు వేల వరకు వసూలు చేసే అవకాశం ఉందని అన్నదాతలు పేర్కొంటున్నారు. అదనంగా భరించాల్సి వస్తుందని దిగులు పడుతున్నారు. చేతికి అందొచ్చిన పంట నేలపాలవుతుందని భయపడుతున్న రైతులు యంత్రాల కోసం వాకబు చేస్తూ తెలిసిన వారిని సంప్రదిస్తున్నారు. అకాల వర్షంతో పాటు గాలులు వీస్తే పంట వాలిపోయి ధాన్యం రాలిపోతుంది. ధాన్యం తడిస్తే మొలకలొచ్చే అవకాశం ఉంది.

వర్షమొస్తే కోలుకోలేని దెబ్బే



వరికోతలను వారంలో ప్రారంభించాలి. ఈలోపు అకాల వర్షం కురిస్తే కోలుకోలేని దెబ్బతగులుతుంది. ఇప్పటికే పెట్టుబడులు పెట్టి బాగా నష్టపోయారు. ధాన్యం రాలిపోయి తడిస్తే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– దయాకర్‌రెడ్డి, రైతు, కల్యాణపురం

ఇబ్బందులే..



తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వానలు కురిశాయని తెలుస్తోంది. జిల్లాలో రెండేళ్ల క్రితం ఇదే సీజన్లో వడగళ్ల వర్షం కురిసి రైతులు నష్టపోవాల్సి వచ్చింది. వారం రోజులు ఉంటే కోతలు పూర్తి చేసుకునేందుకు వీలు కలుగుతుంది.

– వెంకటరమణారెడ్డి, రైతు, సూరాయపాళెం

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



విశేషాలంకారంలో మనుబోలమ్మ

మనుబోలు: మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మకు ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించారు. విశేష పూజలను అర్చకుడు ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని సలిపిండి, పానకాలను నైవేద్యంగా సమర్పించారు.

రామతీర్థంలో రిసార్ట్స్ ప్రారంభం

విడవలూరు : మండలంలోని రామతీర్థం సముద్ర తీరాన తరంగ్ రిసార్ట్స్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. గతంలో ఏపీ టూరిజం ఆధ్వర్యంలో నిర్వహించిన రిసార్ట్స్‌ను తరంగ్ రిసార్ట్స్‌గా తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని మైపాడు, రామతీర్థం బీచ్‌లను పర్యాటక కేంద్రాలుగా చేసేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. రిసార్ట్స్ ఈవెంట్స్ నిర్వాహకులైన వెంకటేశ్వరరావును అభినందించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణచైతన్య, మండలాధ్యక్షుడు చెముకుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మైనింగ్ కేసులో ఇద్దరు పోలీసుల అదుపులోకి..

పొదలకూరు: తాటిపర్తి పంచాయతీ రుస్తుం మైన్ వ్యవహారంలో పోలీసులు అరెస్ట్‌ల పర్వం కొనసాగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులను లక్ష్యంగా చేసుకుని కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు ఆ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. గతనెల 16న పొదలకూరు పోలీస్‌స్టేషన్లో మైనింగ్ డీడీ రుస్తుం మైన్లో అక్రమంగా తెల్లరాయిని తరలించారని ముగ్గురు వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్నేటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డి, వాకాటి శివారెడ్డిలపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసులో వారు ముందస్తు బెయిల్ పొందినట్టు తెలిసింది. ఈ క్రమంలో అదే కేసుకు సంబంధించి మరో ఇద్దరిని ఆదివారం పొదలకూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. గూడూరుకు చెందిన కొండా శివారెడ్డి, నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండకు చెందిన వేమిరెడ్డి అరవింద్‌కుమార్‌రెడ్డిలను కేసులో చేర్చి అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. డీడీ అందజేసిన ఫిర్యాదులో ముగ్గురితోపాటు మరికొంతమంది అని పేర్కొనడంతో పై ఇద్దరినే కాక మరో ఇద్దరి పేర్లు కూడా చేర్చినట్టు సమాచారం.

అన్నదమ్ముల మధ్య ఆస్తి వివాదం

నెల్లూరు సిటీ: అన్నదమ్ముల మధ్య ఆస్తి వివాదం హత్యాయత్నానికి దారి తీసింది. నగరంలోని ఆచారివీధికి చెందిన రాజ్‌మల్‌జైన్ దంపతులకు దిలీప్‌కుమార్‌జైన్, హితేష్‌కుమార్‌జైన్, మనోజ్‌కుమార్‌జైన్ కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు హితేష్‌కుమార్ వేరుగా కాపురం ఉంటుండగా, పెద్ద కుమారుడు వద్ద రాజ్‌మల్‌జైన్ దంపతులు ఉంటున్నారు. హితేష్‌కుమార్‌కు ఆస్తిలో కొంత భాగం ఇవ్వడంతో అతను సుబేదారుపేటలో వ్యాపారం సాగిస్తున్నారు. తండ్రి ఆస్తిని పూర్తిస్థాయిలో పంపకాలు చేయాలని అన్న హితేష్‌కుమార్ ఇంటికి వెళ్లి అడుగుతుండేవారు. కొన్ని నెలలుగా అన్నదమ్ముల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి హితేష్‌కుమార్ ఐదుగురు స్నేహితులతో కలిసి దిలీప్‌కుమార్ ఇంటికి వెళ్లారు. ఇంటి తలుపు తీయకపోవడంతో కోపోద్రిక్తుడైన హితేష్ కుమార్ తన పిస్టల్‌తో తలుపును కాల్చాడు. బాధితులు ఆదివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హితేష్‌కుమార్‌పై హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు.

ప్రజల నెత్తిన పన్నుల భారం



నెల్లూరు(బృందావనం)/నెల్లూరు(వీఆర్సీ సెంటర్): నగరపాలక సంస్థ బడ్జెట్ ప్రతిపాదనలను చూస్తే రానున్న సంవత్సరంలో ప్రజల నుంచి రూ.222 కోట్ల పన్నులను ముక్కుపిండి వసూలు చేయనున్నారనే అంశం అర్థమవుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ 2025– 26 బడ్జెట్‌పై వివిధ రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో సీపీఎం నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నగరాధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, సీపీఐ నేత రామరాజు, సీపీఐ (ఎమ్మెల్) న్యూ డెమోక్రసీ నేత రాంబాబు మాట్లాడారు. కుళాయి, ఇంటి పన్నుల మోత మోగించనున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నామమాత్రపు గ్రాంట్లు రాబట్టలేక చేతులెత్తేశారని ధ్వజమెత్తారు. ఈ విషయంలో మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అనంతరం పలు అంశాలపై తీర్మానాలు చేశారు. సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులు పెంచనున్న రూ.222 కోట్లలో ఇంటి పన్నుల రూపంలో రూ.100 కోట్లు, కుళాయి పన్నులు, యూజర్ చార్జీల పేరుతో మరో రూ.122 కోట్లు వసూలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో నేతలు కొండా ప్రసాద్, నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, పెంచలనరసయ్య, సూర్యనారాయణ, శ్రీనివాసులు, బాబు, మాల్యాద్రి, కత్తి పద్మ పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం

నెల్లూరు(బృందావనం) : ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత, ఆరోగ్యం కలుగుతుందని ఎంజీబీ మాల్ మేనేజింగ్ డైరెక్టర్ గంగాధర్ తెలిపారు. పొదలకూరు రోడ్డు పద్మావతిసెంటర్ వద్ద ఉన్న హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రంలోని సులోచన సదన్ ఆశ్రమంలో ఆధ్యాత్మిక సత్సంగ్ ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గంగాధర్ మాట్లాడుతూ ధ్యానంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర మిషన్ వ్యవస్థాపకుడు లాలాజీ మహారాజ్ చిత్రాన్ని చిత్రకారుడు సోమా పద్మారత్నం పెన్సిల్ ఆర్ట్‌గా వేసి గంగాధర్‌కు అందజేశారు.

5న ఉచిత ఖత్నాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎస్‌బీకే చారిటబుల్ ఫౌండేషన్‌కు సంబంధించిన ఉచిత ఖత్నాల పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు. పార్టీ నగరాధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఇప్పటివరకు ట్రస్ట్ ద్వారా 3,800 మంది పేద, అనాథ ముస్లిం పిల్లలకు ఖత్నాలు చేశారని, మే 5వ తేదీ సోమవారం ఉదయం వెంగళరావునగర్‌లో ఉన్న తాతయ్య స్కూల్‌లో ఉచిత ఖత్నాలు చేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 91779 69173, 82476 92014, 79896 03905 నంబర్లను సంప్రదించాలని కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



పొదలకూరు: పట్టణంలోని యాదవవీధి, తొగటవీధి, పద్మావతినగర్, సాయిబాబా వీధిలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ఉగాది పండగ విశిష్టతను తెలియజేశారు. ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు పెంచలనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలం చేరిన సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీ



వెంకటాచలం: పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లా బక్కాలి నుంచి తమిళనాడులోని కన్యాకుమారి వరకు సీఐఎస్ఎఫ్ సిబ్బంది చేపట్టిన సైకిల్ యాత్ర వెంకటాచలానికి ఆదివారం మధ్యాహ్నం చేరుకుంది. దేశంలోకి అక్రమ చొరబాట్లు, స్మగ్లింగ్‌ను అదుపు చేయడం, తీర ప్రాంతాల రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో సైకిల్ యాత్రను సీఐఎస్ఎఫ్ సిబ్బంది ప్రారంభించారు. వెంకటాచలం టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్న 60 మంది సిబ్బందికి ఆర్డీఓ అనూష, రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు వివిధ పాఠశాలల విద్యార్థులు ఘన స్వాగతం పలికారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



కోవూరు : పాటూరులో..

కోవూరు : మండల కేంద్రంలోని పాటూరు రోడ్డులో ఉన్న సీతా పోలయ్య భవన్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ నాయకులు సురేష్, సుబ్బారావు, హరి, అష్రోజ్, యస్దాని, మాబాషా, బాబు, చాంద్‌బాషా, కల్పన, ఫాతిమా, శివ, రామ్మూర్తి పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం : దామరమడుగు గ్రామంలో..

వారి ఆశయాలను కొనసాగించండి

బుచ్చిరెడ్డిపాళెం : భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ కోరారు. మండలంలోని దామరమడుగు గ్రామంలో భగత్‌సింగ్ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గండవరపు ఓంకార్, గుండాల సతీష్, వంజీవాక కృష్ణప్రసాద్, గరికపాటి సురేష్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

దోపిడీకి గురవుతున్న అన్నదాత

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



శామ్‌సన్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న కాకాణి

తోటపల్లిగూడూరు: కూటమి ప్రభుత్వంలో రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని పేడూరు పంచాయతీ మాజీ ఉప సర్పంచ్, పార్టీ నేత సాదేపల్లి శామ్‌సన్ గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఈ క్రమంలో పేడూరులోని వారి నివాసానికి ఆదివారం చేరుకొని భౌతికకాయానికి నివాళులర్పించారు. ధాన్యం విక్రయాల్లో గిట్టుబాటు ధర లభించక విపరీతంగా నష్టపోతున్నామని కాకాణితో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం కనుమరుగయ్యాయని ఆరోపించారు. ధాన్యం ధరలు పతనమవుతున్నా, అధికారులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని ధ్వజమెత్తారు. రైతులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి వదిలేసి దళారులను వెంటపెట్టుకొని ధాన్యం పరిశీలనకు వెళ్తున్నారని విమర్శించారు. ధాన్యానికి గిట్టుబాటు ధర లభించక రైతులు నానా అవస్థలు పడుతుంటే, అధికారులు మాత్రం విస్తృతంగా కొనుగోలు చేస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందని చెప్పారు.

రైతులను ఆదుకున్న జగన్

గత ప్రభుత్వ హయాంలో తమను నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా ఆదుకున్నారని, అయితే చంద్రబాబు నిలువునా ముంచారని సాక్షాత్తు రైతులే గగ్గోలు పెడుతున్నారన్నారు. 2019 ఎన్నికలకు ముందు నాటి టీడీపీ ప్రభుత్వం కొలిదిబ్బ గిరిజన కాలనీకి సీసీ రోడ్డు నిర్మించేందుకు శిలాఫలకం వేసి పలాయనం చిత్తగిస్తే, తాను నిధులిచ్చి రోడ్డును నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు అనేక హామీలిచ్చి ఓట్లేయించుకొని ప్రజలను నిలువునా మోసం చేశారని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఏ అవసరమొచ్చినా, సత్వరమే స్పందిస్తూ సహకరిస్తున్నానని తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, నేతలు తిక్కవరపు సనత్‌కుమార్‌రెడ్డి, తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి, మన్నెం చిరంజీవులుగౌడ్, దేవళ్ల శ్రీనివాసులురెడ్డి, మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్, ఆకుల మధు, దుంపల ఏసోబు, అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

పదవులను ఎవరికి ఇవ్వాలో తెలుసు

- ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం : తమ పార్టీలో ఉన్న నాయకులకు ఏ పదవులు ఇవ్వాలో వేరొకరు చెప్పాల్సిన అవసరం లేదని.. అది మా ఇష్టమంటూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్లో ఆమె ఆదివారం మాట్లాడారు. తమ పార్టీలోని నాయకులు, కార్యకర్తలకు ఏం చేయాలన్న దానిపై ఇతర పార్టీలకు చెందిన వారి సలహాలు ఇవ్వొద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బుచ్చి చైర్‌పర్సన్ సుప్రజ, పెన్నా డెల్టా మాజీ చైర్మన్ వై.గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అయితే కార్యక్రమంలో జనసేన, బీజేపీ నాయకులను స్టేజీ మీదకు ఆహ్వానించకపోవడంతో వారు మధ్యలోనే వెళ్లిపోవడం గమనార్హం.

పరీక్ష కేంద్రాల్లో తనిఖీ



పొదలకూరు: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నిర్వహించిన ఉల్లాస్ పరీక్ష కేంద్రాలను అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ మహ్మద్ అజాద్ ఆదివారం తనిఖీ చేశారు. మండలంలో 693 మందికి గానూ 45 అంగన్‌వాడీ స్కూళ్లలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పొదలకూరు, బిరదవోలులోని కేంద్రాలను డీడీతో పాటు సూపర్‌వైజర్ మస్తాన్‌రెడ్డి పరిశీలించారు. వెలుగు ఏపీఎం చిన్నయ్య, సీసీ సరోజ, వీఓఏ భాగ్యమ్మ, అంగన్‌వాడీ ప్రవీణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏమరుపాటుగా ఉంటే అంతే..



హైవే మధ్య మేత మేస్తున్న ఆవులు


- జాతీయ రహదారిపై పశువుల సంచారం
- తరచూ ప్రమాదాలు

మనుబోలు: జాతీయ రహదారిపై ఆవులు, గేదెల కారణంగా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మండల పరిధిలోని పోర్టు క్రాస్‌రోడ్డు నుంచి బద్దెవోలు క్రాస్‌రోడ్డు వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. డివైడర్లపై ఐదు నుంచి ఎనిమిది అడుగుల వెడల్పుతో పూలు, గోరింటాకు మొక్కలను పెంచారు. తరచూ నీళ్లు పడుతుండటంతో గడ్డి బాగా పెరిగి పచ్చదనం పరుచుకుంది. దీంతో ఆవులు, గేదెలు మేత కోసం హైవేపైకి వస్తున్నాయి. ఈ క్రమంలో వేగంగా వెళ్లే వాహనాల కిందపడి పశువులు చనిపోవడమో లేదా ఇతర ప్రమాదాలకు కారణమవుతున్నాయి. హైవేపైకి పశువులు రాకుండా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పుట్టాలమ్మకు విశేష పూజలు



పుష్పాలంకరణలో పుట్టాలమ్మ



పోటెత్తిన భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాల గ్రామంలో కొలువైన పుట్టాలమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చలిపిండి పానకాలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా తూపిలి వెంకట్రామిరెడ్డి (టీవీఆర్) కుటుంబ సభ్యులు వ్యవహరించారు. తొలుత ఆలయ అర్చకులు అమ్మవారికి పుష్పాలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన చలిపిండి పానకాల కార్యక్రమంలో గ్రామంతో పాటు మండల నలుమూలల నుంచి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గ్రామంలో గత 15 ఏళ్లుగా ఉగాదికి నెల రోజుల ముందు మూడు ఆదివారాలు, మూడు మంగళవారాలు చలిపిండి పానకాలు, చద్ది సమర్పణ కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ వస్తోంది.